నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 69 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
31-12-2025 బుధవారం వెల : 1/- పేజీలు : 4

# నవతరం నాయకత్వానికి చిరునామా

# సాయిరాం



ఉద్యోగం ఒక హోదా కాదు, సేవ చేసే అవకాశం అని గట్టిగా నమ్మే ఉద్యోగ నాయకుడు సాయిరాం. వినయం ఆయన సహజ స్వభావం, బాధ్యత ఆయన నిర్ణయాలకు బలమైన పునాది. కార్యాలయ వ్యవస్థలో వేగం, క్రమశిక్షణను తీసుకువస్తూనే, ప్రతి వ్యక్తిని మనిషిగా చూడగల మానవీయతతో కూడిన నాయకత్వం ఆయనది. సమస్య ఎదురైతే మాటలకే పరిమితం కాకుండా, పనిలోనే పరిష్కారం చూపే ధైర్యం ఆయన ప్రత్యేకత. ఉద్యోగుల్లో నమ్మకం, ఉత్సాహం పెరిగేలా ప్రోత్సహించే తీరు, వ్యవస్థపై విశ్వాసాన్ని బలపరిచింది. ప్రజలకూ, వ్యవస్థకూ సమానంగా న్యాయం చేయాలన్న స్పష్టమైన నిబద్ధతతో సాయిరాం గారు నేడు నవతరం ఉద్యోగ నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు.



- వినయమే ఆయన బలం
- ఉద్యోగ సంఘ నాయకత్వానికి మరో నిర్వచనం
- సేవే శ్వాసగా సాగే ఆయన ప్రయాణం
- ఉద్యోగులతోనే.. ఉద్యోగుల కోసమే ఆయన జీవితం
- నమ్మకం నుంచి నాయకత్వం వరకు
- పదవులు మారినా లక్ష్యం ఒక్కటే - ఉద్యోగుల హక్కులు, సంక్షేమమే.
- వినయమే విజయం
- ఎత్తుకు ఎదిగినా నేలపై నడక.
- నిర్ణయాల్లో ధైర్యం
- సమస్య క్లిష్టమైనా పరిష్కారమే లక్ష్యం.
- నమ్మకమే మూలధనం
- ఉద్యోగుల విశ్వాసమే ఆయన బలం.



**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం:**

సేవలో హామీ, వినయంలో విలువ %-% ఈ మాటలు సాయిరాం గారిని చూసిన ప్రతివారికీ సహజంగా గుర్తుకు వస్తాయి. సామాన్య ఉద్యోగిగా ప్రారంభమై, నేడు ఏపీ ఎన్జీవో ఉద్యోగ సంఘ నాయకుడిగా ఉద్యోగుల మనసుల్లో స్థానం సంపాదించిన నాయకుడు సాయిరాం.
నాయకత్వమంటే హంగు కాదు, బాధ్యత మాత్రమేనని నమ్మే ఆయన, ఆ బాధ్యతను ఉద్యోగుల ప్రయోజనాలకు అంకితం చేశారు.
కార్యాలయంలో సహోద్యోగులకు మార్గదర్శకుడిగా, బయట ఉద్యోగుల హక్కుల కోసం పోరాడే నాయకుడిగా ఆయన పాత్ర స్పష్టంగా కనిపిస్తుంది. బాధ్యత అంటే పదవి కాదు, ఉద్యోగుల నమ్మకాన్ని మోసుకెళ్లడమేనని ఆయన నడకే చెబుతోంది. సమస్య ఎదురైతే మాటలతో కాదు, సంఘటిత కార్యాచరణతో పరిష్కారం చూపే నాయకత్వం ఆయన సొంతం.
సాయిరాం గారి ఉద్యోగ సంఘ నాయకత్వం మాటల మాయ కాదుబీ పనితీరే సాక్ష్యం.
ఉద్యోగుల సమస్యను గుర్తించడంలో క్షణాల ఆలస్యం లేదు. సంబంధిత అధికారులతో చర్చలు, స్పష్టమైన డిమాండ్లు, క్రమబద్ధమైన కార్యాచరణతో పరిష్కార దిశగా అడుగులు వేయడం ఆయన ప్రత్యేకత.
సంస్థాగత క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూనే, ఉద్యోగుల మానవీయ అవసరాలను గుర్తించే తీరు ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతుంది. ఉద్యోగుల్లో ఉత్సాహం పెరగడానికి ప్రోత్సాహం, బాధ్యతాయుత పనితీరుకు స్పష్టమైన మార్గదర్శకాలు -ఇవన్నీ కలిసి సంఘాన్ని బలోపేతం చేశాయి.
యువ ఉద్యోగుల్లో ఆశలు నింపే మాటలు కాదు, అవకాశాలు కల్పించే చర్యలే ఆయన విధానం. ఉద్యోగ భద్రత, సంక్షేమం, గౌరవం - ఈ మూడింటి మధ్య సమతుల్యతే ఆయన దృష్టి.
ప్రశంసల్లో వినయం, విమర్శల్లో సవరణ

### ఈ పరిపక్వతే ఆయన నాయకత్వానికి బలం.

భవిష్యత్తుపై స్పష్టమైన దృష్టితో, ఉద్యోగ సంఘాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దే దిశగా సాయిరాం గారు ముందుకు సాగుతున్నారు. మార్పు మాటల్లో కాదు, నిర్ణయాల్లోనూ చర్యల్లోనూ కనిపించాలన్న నమ్మకంతో నడిచే ఈ నాయకత్వం ఉద్యోగుల మనసుల్లో విశ్వాసంగా నిలిచింది.
ఇంట్లో విలువల్ని నేర్పే కుటుంబ సభ్యుడిగా, బయట ఉద్యోగుల కోసం నిలిచే సంఘ నాయకుడిగా - సాయిరాం గారి ప్రయాణం నవతరం ఏపీ ఎన్జీవో నాయకత్వానికి సజీవ ఉదాహరణ.




### నూతన కార్గవర్గం :

ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. జిల్లా అధ్యక్షుడిగా హనుమంతు సాయిరాం, కార్యదర్శిగా చల్లా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు మొత్తం కార్యవర్గం పోటీ లేకుండా ఎంపికైంది. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల సాధనే ప్రధాన లక్ష్యంగా కొత్త కార్యవర్గం పనిచేస్తుందని హనుమంతు సాయిరాం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ నేతృత్వంలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.

## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు
- రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రార్థన



**(నవతరం పాతపట్నం)**

వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి గారు విశాఖపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు.
ఈ సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్న రెడ్డి శాంతి గారు, స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.
అనంతరం రెడ్డి శాంతి గారు మాట్లాడుతూ, "ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రమైన పర్వదినం. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం శాంతి సౌభాగ్యాలతో వెలసాలని నరసింహ స్వామిని ప్రార్థించాను" అని పేర్కొన్నారు.

## ఈవీఎంలు భద్రం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాముల పరిశీలన



**నవతరం - శ్రీకాకుళం**

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) అత్యంత భద్రంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాములను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే తనిఖీల్లో భాగంగా గోదాము సీళ్లను తెరిచి యంత్రాలను పరిశీలించారు. అనంతరం తనిఖీ పుస్తకంలో కలెక్టర్‌తో పాటు ప్రతినిధులు సంతకాలు చేశారు. గోదాముల వద్ద భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును, విద్యుత్ సౌకర్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని, పోలీసు భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని ఆదేశించారు.

**18,92,149 మంది ఓటర్లు:**

తనిఖీలకు ముందు కలెక్టరేట్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఓటర్ల తాజా గణాంకాలను వెల్లడించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 18,92,149 మంది ఓటర్లు ఉన్నారని అందులో పురుషులు 9,37,191 మంది కాగా, మహిళా ఓటర్లు 9,54,848 మంది ఉన్నారని వివరించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధికంగా 2,75,568 మంది ఓటర్లు ఉండగా, ఆమదాలవలసలో అత్యల్పంగా 1,94,209 మంది ఓటర్లు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,358 పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గత జనవరి 6 నుంచి ఈ డిసెంబర్ 30 వరకు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు కోసం 37,586 దరఖాస్తులు అందాయని, వాటిలో 29,795 దరఖాస్తులను ఆమోదించామని కలెక్టర్ వివరించారు. ఓటరు జాబితా నాణ్యత, పారదర్శకత విషయంలో రాజకీయ పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ లక్ష్మణమూర్తి, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వరరావు, వివిధ పార్టీల ప్రతినిధులు పి.ఎం.జె బాబు, భూపతి అర్జున్ కుమార్, సురేష్ సింగ్, రౌతు శంకరరావు, ఎల్. సోమేశ్వరరావు, ఎం. గోవిందరావు, కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, పి. కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఈనాడు ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఐతం విద్యార్థుల విజయం

**నవతరం టెక్కలి**

ఈనాడు ట్రోఫీ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఐతం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల బృందం అద్భుత ప్రదర్శనతో సూపర్ ఓవర్ విజేతలుగా నిలిచింది. పోటీలంతటా సమష్టి కృషి, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన ఐతం జట్టు ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ టోర్నమెంట్‌లో ఐతం జట్టు సభ్యుడు బి. తనూజ్ ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా, పి. జయరాజ్ ఉత్తమ ఫీల్డర్‌గా ఎంపికై ప్రత్యేక పురస్కారాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ వి.వి. నాగేశ్వరావు, ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. పి.వి. మురళీధర్, ప్రొఫెసర్ డి విష్ణుమూర్తి, డీన్ లు హెచ్ ఒ డి లు,పీడీలు ఎస్. లక్ష్మణ్ మూర్తి, టి. మురళీ మోహన్, జె. తేజేశ్వని, తదితరులు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉన్నత ప్రతిభను కనబర్చాలని వారు ఆకాంక్షించారు.



ఎడిటోరియల్

# న్యాయం ఓటమి!

న్యాయం చివరి ఆశగా కోర్టు మెట్లెక్కిన బాధితకు అదే కోర్టు అన్యాయం చేస్తే? అది ఎవరికోసం అన్న ప్రశ్నే మిగులుతుంది. ఉన్నావ్ మైనర్‌పై లైంగికదాడి కేసులో బీజేపీ మాజీ ఎమ్మెల్యే, కుల్ దీప్‌సింగ్ సెంగార్‌ను విడుదల చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఆ వ్యవస్థ మీద ఉన్న నమ్మకాన్నే కూల్చేసింది. ఒక నిందితుడిని విడుదల చేసిన ఘటనగా దీన్ని చూడలేం. అది బాధితురాలి గుండెల్లో మిగిలిన ఊపిరిని తీసిన క్షణం. అవమానాలు,అవహేళనలను దిగమింగుతూ, దాడులు, దౌర్జన్యాలను ఎదుర్కొంటూ, ఎనిమిదేండ్లుగా పోరా డుతున్న ఆ కుటుంబానికి పడిన శిక్ష ఏదైనా ఉందంటే అది నిజంగా ఇప్పుడే. ఇది బాధాకరం. ఆమె ఆక్రందనకు దేశమంతా స్పందించినా నాలుగు గోడల మధ్య ఉన్న నల్లకోటు మాత్రం చలించలేదు. సాక్ష్యాలు లేవనే సాకుతో కేసు కొట్టేసిన కోర్టు ఆ సాక్ష్యాలు ఎందుకు మౌనంగా ఉన్నా యో తెరచి చూడకపోవడం విచార కరం. దీన్ని న్యాయ వైఫల్యం అనడం కంటే అధికారానికి మోకరిల్లిన దౌర్భగ్యం అనడం సబబేమో!

2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ ఘటన వెలుగులోకి రాగానే ఇది సాధారణ ఘటన కాదని స్పష్టమైంది. 'నాకు న్యాయం కావాలి' అంటూ రోడ్డెక్కినప్పటి నుంచే ఆమెపై 'అధికార వ్యవస్థ' దాడి ప్రారంభించింది. నిందితుడు పాలకపార్టీకి చెందిన ఎమ్మెల్యే, అందులో కుల ప్రభావం కలిగిన నేత. ఆమెను ఎత్తుకుపోయి రోజులపాటు నిర్భంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు ఆ నీచుడు. ఆమెను అమ్మేందుకు ప్రయత్నించాడు. చంపేందుకు కూడా వెనుకాడలేదు. చెరనుంచి ఎలాగో తప్పించుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోలేదు. పైగా 'మౌనంగా ఉండమని' బెదిరింపులు, ఒత్తిళ్లు. మొదటి దశలోనే రాష్ట్ర యంత్రాంగం నేరస్తుడి పక్షాన నిలిచింది. పైగా నిందితుడితో చేతులు కలిపి రాజీకోసం ఆమెపైనే ఒత్తిడి తెచ్చారు. కేసు నమోదు కావడానికే ఏడాది పట్టింది. ఈలోగా ఏదో పాత కేసును తోడి ఆమె తండ్రిని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. కాపాడుకోవాలని చేసిన ప్రయత్నంలో బాధితురాలు ఠాణాల వెంట తిరిగి తిరిగి చివరికి సీఎం ఇంటి ఎదుట ఆత్మహత్యకు యత్నించింది. అప్పటికే అతను పోలీసు కస్టడీలోనే మరణించాడు. ముందు అనుమా నాస్పద మృతిగా చిత్రించినా తర్వాత హత్యేనని నిర్ధారణ అయింది.

సామాజిక, ప్రజాసంఘాల ఆందోళనలు మిన్నంటాయి. మీడియా కథనాలు, బాధితురాలి పక్షాన నిలిచాయి. ప్రజల నిరసనలు కోర్టు గోడలకు తాకాయి. రాజకీయంగా బీజేపీని అప్రతిష్టపాలు చేశాయి. చివరకు న్యాయస్థానం జోక్యం చేసుకుంది. ఎమ్మెల్యేను అరెస్టు చేశారు. ఇక్కడ కూడా న్యాయం కాదు, ఒత్తిడే పనిచేసింది. జైల్లో ఉన్న కూడా బాధితురాలిపై వేట కొనసాగింది. 2019లో వారి కుటుంబం ప్రయాణిస్తున్న కారును ఒక ట్రక్కు ఢకొట్టింది. ఆ ఘటనలో ప్రధానసాక్షి ఆమె అత్త, మరో బంధువు చనిపోయారు. న్యాయవాదికి తీవ్రగాయలయ్యాయి. బాధితురాలు ఎయిమ్స్‌లో కొన్ని నెలల పాటు చికిత్స పొందింది. ఇది ప్రమాదమా, హత్యనా అన్నది జగమెరిగిన సత్యం! వరుసగా బెదిరిం పులు, హెచ్చరికలు, ముందుకొచ్చిన సాక్షులు కూడా భయంతో మౌనమయ్యారు. సుప్రీంకోర్టు జోక్యంతో కేసు సీబీఐకి బదిలీ అయి ఉత్తరప్రదేశ్ నుంచి ఢిల్లీ గేటును తాకింది. చివరికి ట్రయల్ కోర్టు నిందితుడికి జీవితఖైదు విధించింది. అప్పట్లో దీన్ని న్యాయ విజయంగా భావించారు. కానీ, ఇప్పుడు ఢిల్లీ హైకోర్టు శిక్షను సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఉపశమనం ఆ 'విజయం' ఎంత భ్రమలో ఉందో చాటింది.

ఇది ఒక్క ఉన్నావ్‌కే పరిమితం కాదు. బిల్కిస్‌బానో నుంచి కతువా వరకూ, డేరాబాబా నుంచి హత్రాస్ వరకూ, మణిపూర్ నుంచి మహిళా రెజ్లర్ల వరకూ.. మహిళల శరీరాలపై జరిగిన నేరాలు ఇప్పటికీ తీర్పుల గదుల్లో విచారణలోనే ఉన్నాయి. కానీ నిందితులు మాత్రం స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. కేవలం ప్రశ్నించిన పాపానికి ఉమర్ ఖలీద్ లాంటి జేఎన్‌యూ పరిశోధక విద్యార్థి 'ఉపా' కింద జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. 'న్యాయం గెలుస్తుందని' చెప్పుకుంటాం. కానీ, మన దేశ అనుభవం చెబుతున్న నిజం వేరే. గెలిచేదంతా న్యాయం కాదు, అధికారానికి నచ్చినంత న్యాయం మాత్రమే. మిగిలిన న్యాయం%ొ%బాధితురాలి కన్నీళ్లలో కరిగిపోతుంది, ఫైళ్ల మధ్య మాయమవుతుంది. తీర్పుల సాంకేతిక పదజాలంలో ఊపిరాడక చనిపోతుంది. ఈ ఘటనలన్నీ కలిపి చూస్తే ఒకే సరళి స్పష్టమవుతోంది. బాధితుడు బలహీన వర్గానికి చెందితే న్యాయం కోసం పోరాడాల్సిందే. నిందితుడు రాజకీయ, సామాజిక లేదా మత ప్రభావం కలిగినవాడైతే వ్యవస్థ అతనికి అనుకూలంగా మారుతుంది. అందుకే ఉన్నావ్ తీర్పు సభ్యసమాజానికి ఒక హెచ్చరిక. న్యాయం కోర్టు గదుల్లోనే రక్షించబడదు. ప్రజల నిరంతర ప్రశ్నలు, ఒత్తిడి లేకపోతే అది అధికారానికి బానిసగా మారుతుంది. ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సమాజమంతా స్పందించాలి. లేకపోతే ప్రతి ఉన్నావ్ తర్వాత మరో బిల్కిస్, మరో కతువా, మరో బాధిత– ఈ దేశ చరిత్రలో చేరుతూనే ఉంటాయి.

## రాజీలేని స్వరాజ్య వీరుడు త్రిపురాన

- గాంధీ మందిరంలో 104 జయంతి వేడుకలు
- తండ్రి ఆశయాన్ని కొనసాగిస్తా: మాజీ మంత్రి వెంకటరత్నం




**నవతరం-శ్రీకాకుళం**

స్వాతంత్ర్య సమరంలో వీరోచితంగా పోరాడిన గొప్ప వ్యక్తి త్రిపురాన రాఘవదాసు అని మాజీ మంత్రి డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు దివంగత త్రిపురాన రాఘవదాసు 104వ జయంతి వేడుకలు గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ తన తండ్రి రాఘవదాసు స్వాతంత్ర్య పోరాటంలోనే కాకుండా ప్రజాజీవితంలో కూడా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించి ప్రజల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సామాజిక సమానత్వంతో పాటు స్త్రీ పురుషుల సమానత్వాన్ని మేలుకొలిపి సమాజహిత కార్యక్రమాలు చేపట్టారన్నారు. స్వాతంత్ర్య పోరాటం అనంతరం సమరయోధుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఇళ్లు, స్థలాలు, పింఛన్లు కోసం కృషి చేస్తూనే ఉండేవారన్నారు. చదువుతో పాటు సమాజాన్ని చదివే విధానాన్ని తండ్రి ద్వారా అలవర్చుకున్నానని, ఆయన స్ఫూర్తితో తాము ఎన్నో కార్యక్రమాలు చేపట్టగలుగుతున్నామన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, సాంఘిక సంక్షేమ కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌గా తాను విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించడానికి తన తండ్రి రాఘవదాసు అందించిన స్ఫూర్తి ఎన్నటికీ మరువలేమన్నారు. విద్యావేత్త, గాంధీ మందిర కమిటీ కన్వీనర్ డాక్టర్ జామి భీమశంకర్ మాట్లాడుతూ జిల్లా ఖ్యాతిని త్రిపురాన రాఘవదాసు నిలిపారన్నారు. గాంధీ మందిర కమిటీ సభ్యులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ జమిందార్ కుటుంబంలో పుట్టి అదే జమిందారీ వ్యవస్థపై పోరాడిన చరిత్ర త్రిపురాన రాఘవదాసుకు ఉందని, పాడిపరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పాల శీతల కేంద్రాలు ఏర్పాటు చేసి రైతాంగానికి ప్రయోజనం చేకూర్చారని, శాసనమండలి సభ్యునిగా ప్రజల పక్షాన గొంతు వినిపించారన్నారు. రాఘవదాసు స్ఫూర్తితో ఆయన కుమార్తె ఎమ్మెల్యేగా, మంత్రిగా వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌గా అందించిన సేవలు ఆయన ప్రశంసించారు. స్వాతంత్ర్య పోరాటంలో రాఘవదాసు పోషించిన పాత్రను తెలగ సంక్షేమసంఘ నాయకులు పి.దయానంద్‌మాస్టార్ వివరించారు. గాంధీ మందిర కమిటీ సమన్వయకర్త ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు త్రిపురాన రాఘవదాసు విగ్రహాన్ని గాంధీ మందిరంలో ఆయన కుమార్తె డాక్టర్ వెంకటరత్నం ఏర్పాటు చేయడంతో పాటు దుర్గాభాయి దేశ్‌ముఖ్, లాలిశెట్టి అప్పారావు విగ్రహాలను కూడా ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. తొలుత గాంధీ విగ్రహానికి, అనంతరం రాఘవదాసు విగ్రహానికి డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం పూలమాలలు వేశారు. విగ్రహదాత డాక్టర్ త్రిపురాన వెంకటరత్నంను శ్రీప్రగతి మహిళా మండలి అధ్యక్షురాలు కోట సావిత్రమ్మ సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాంధీర మందిర కమిటీ సభ్యులు నక్క శంకరరావు, ఎం.ఏ.ఎన్.భట్లు, కొంక్యాన మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

స్వాతంత్ర్య సమరయోధులు త్రిపురాన రాఘవదాసు 104వ జయంతి సందర్భంగా గాంధీ మందిరంలో ఉన్న రాఘవదాసు విగ్రహానికి తెలగ సంక్షేమ సంఘ నేతలు పూలమాలలు వేశారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ, ప్రజా జీవితంలోను రాఘవదాస్ చేసిన కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పిల్లల నీలాద్రి, తెలగ సంఘం నేతలు జి.వి.రమణ, జి.ఎన్.నాయుడు, బి.శ్యాం, కె.రాంబాబు, జి.అమర్‌నాథ్, వై.వి.రమణ, పెద్ది కవిత, ఎం.భవానీ ప్రసాద్, వై.చిట్టిబాబు, ఎల్.ఆనంద్, పి.శశి, ఎం.మాధవరావు, ఏ.రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 1 నుంచి పింఛను దారుల జీవన ప్రమాణ దృవికరణ పత్రాలు అందజేయాలి

**ఖజానా ఉప సంచాలకులు సి. హెచ్. రవి కుమార్**



**నవతరం-శ్రీకాకుళం**

జనవరి 1 నుండి ఫింఛను దారుల జీవన ప్రమాణ ధృవీకరణ పత్రాలు అందజేయాలని ఖజానా శాఖ ఉప సంచాలకులు సిహెచ్. రవి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (సర్వీసు పింఛను దారులు), కుటుంభ పింఛను దారులు వార్షిక జీవన ప్రమాణ దృవీకరణ పత్రాలు జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 లోగా సమర్పించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, కుటుంభ పింఛను దారులు తమ వార్షిక జీవన ప్రమాణ దృవీకరణ పత్రాలను జీవన ప్రమాణ్ పోర్టల్ లో గానీ, ఫింఛనర్ల వ్యక్తిగత సి.ఎఫ్.ఎం.ఎస్ లాగిన్ లో గాని లేదా ఖజానా కార్యాలయంలో సమర్పించవచ్చు అని సూచించారు. ఆధార్, మొబైల్, పి పి ఓ బ్యాంకు ఖాతా సరిచూసుకోవాలని తెలియజేశారు. ఫిబ్రవరి 28 లోగా సమర్పించకపోతే ఏప్రిల్ ఒకటో తేదీ వచ్చే మార్చి నెల పింఛను నిలిపివేయబడతాదని తెలిపారు. జిల్లా ఖజానా, లెక్కల కార్యాలయం, శ్రీకాకుళం, ఫింఛను విభాగం వద్ద, జిల్లాలో గల అన్ని ఉప ఖజానా కార్యాలయాలలో వార్షిక జీవన ప్రమాణ దృవీకరణ పత్రాల కొరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## 311 మందికి నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే ఈశ్వరరావు

## ఎచ్చెర్లలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన




**నవతరం-ఎచ్చెర్ల**

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, గతంలో నిరుద్యోగులు కంపెనీల చుట్టూ తిరిగితే ఇప్పుడు కంపెనీలే మీ వద్దకు వచ్చి ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి నెలకొందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడికుదిటి ఈశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎచ్చెర్లలోని శ్రీ సాయి శిరీష డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 14 ప్రముఖ ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 621 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 311 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసి, వారికి నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ బి. శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ..వచ్చిన అవకాశం చిన్నదని, జీతం తక్కువని లేదా దూర ప్రాంతమని వెనకడుగు వేయక తొలి అడుగు వేస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని యువతకు దిశానిర్దేశం చేశారు. ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కె. సుధ సూచించారు.

యువతలో నైపుణ్యాల ప్రాముఖ్యత గురించి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వి. రమణమూర్తి వివరించగా, ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ కోరారు.

ఏ రంగంలో అవకాశం వచ్చినా దూరాన్ని లెక్క చేయకుండా చేరాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి, ఎన్.వై.కే డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్, సెట్ శ్రీ సీఈఓ అప్పలనాయుడు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, న్యూక్లియర్ పర్మనెంట్ చీఫ్ ఇంజనీర్ రవికుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వర్ రావు, వివిధ ప్రజా ప్రతినిధులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## "నూతన సంవత్సరంలో వర్శిటీకు మరిన్ని శుభఫలాలు"



**నవతరం-ఎచ్చెర్ల**

రానున్న నూతన సంవత్సరం వర్శిటీ వర్గాలకు, అనుబంధ కళాశాలలకు, ఉన్నత విద్యారంగానికి మరింత శుభసూచికంగా ఉంటూ మరిన్ని ప్రగతి ఫలాలు అందించాలన్న ఆశాభావాన్ని డా. బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజని వ్యక్తం చేశారు. 2026 నూతన సంవత్సరానికి సంబంధించి డా.బీఆర్‌ఏయూ ముద్రించిన క్యాలండర్ మరియు డైరీలను మంగళవారం తన ఛాంబర్ లో వర్శిటీ ఉన్నతాధికారులతో కలసి వీసీ ఆవిష్కరించారు. క్యాలండర్ లో పొందుపరిచిన సిక్కోలు ప్రత్యేకతలు, చారిత్రక-పర్యాటక ప్రదేశాల చిత్రాలు ఎంతో సమాచారహితంగా, ఆకర్షణీయంగా ఉన్నాయని వీసీ అభిప్రాయపడ్డారు. అదేవిధంగా వర్శిటీ సమాచారాన్ని, 2025లో జరిగిన ముఖ్య సమావేశాల ఫొటోలు మరియు వివరాలతో రూపొందించిన డైరీ కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వీటి రూపకల్పనలో భాగస్వాములైన వర్శిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం అధ్యాపకులు, కమిటీలోని ఇతర సభ్యులకు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో, వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, ఎస్.ఓ. డా. కె.సామ్రాజ్య లక్ష్మి, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రాజశేఖర రావు, ఎగ్జామ్స్ మరియు సీడీసీ డీన్ డా. ఎస్. ఉదయ భాస్కర్‌లు పాల్గొన్నారు.

# అయ్యప్ప "స్వామి" అంటే.....



జీవులన్నిటిలోను దేవుడున్నాడనే భావంతోనే జీవులన్నిటిని 'స్వామి' అని పిలవాలని అయ్యప్ప దీక్షలో నియమాన్ని విధించారు. అందుచేతనే అయ్యప్ప దీక్షలో ఉన్న భక్తులు అందరినీ "స్వామి" అనే పిలుస్తారు.
వేదములు, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మ సూత్రాది అనేక శాస్త్రాలు వివరించిన విషయం ఏమిటంటే జీవులన్నిటిలోను దేవుడున్నాడని.
వ్యాస వాల్మీకాది మహర్షులు కూడా జీవరాశులన్నిటిలోను పరమాత్ముడు ఉన్నాడని చెప్పియున్నారు.
విభిన్న దేహాలలో భగవంతుడు భిన్నత్వంలో ఏకత్వంలా ప్రకాశిస్తున్నాడని (శ్రీఆదిశంకరులు శంకర భాష్యంలో) వివరించారు. భగవద్గీత యందలి జ్ఞానయోగంలో "సర్వభూత స్థితం" అనే శ్లోకంలో కృష్ణ భగవానుడేమన్నాడంటే%ొ% 'అందరి హృదయములందున్న నన్ను ఎవరు భక్తి యుక్త సేవతో సేవించునో అట్టి భక్తుడు అన్ని పరిస్థితులయందును, ఎల్లప్పుడు నా యందే యుండును' అని చెప్పియున్నాడు.
జీవులన్నీ బ్రహ్మము కన్నా భిన్నమైనవి కావని బ్రహ్మ సూత్రములయందు నిరూపింపబడినది.
బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులు ముక్త కంఠంతో చెప్పిన ఈ మాటలను నిజం చేసి చూపింది అయ్యప్ప భక్తులే.
ఉపనిషత్తులలో ఒకటైన "గోపాలతాపన్యుపనిషత్తు" లో కూడా ఇదే విషయమై అసంఖ్యాకములైన ప్రాణుల హృదయాలలో బహురూపములతో భగవంతుడే ఉన్నాడని వ్రాయబడెను.
అన్నమాచార్యుడు కూడా అణువు మొదలు అఖిలాండము వరకు గల జీవరాశులన్నీటిలో ఉన్నది కూడా పరమాత్ముడేనని "బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మమొక్కటే" అనే కీర్తనలో తెలియజేసాడు.
త్యాగరాజస్వామి వారు తాను రచించిన కీర్తనలో చీమలో, బ్రహ్మలో , శివకేశవాదులలో నెలకొన్నది కూడా బ్రహ్మమే అని తెలియజేసియున్నాడు.
ఈ విధంగా భగవంతుడే జీవరాశులన్నిటిలోను ఉన్నాడనే భావంతోనే అయ్యప్ప దీక్షను తీసుకున్నవారు, మనుషులందరినీ "స్వామి" అని పిలవడమే గాక పశు వులను, పక్షులను, జంతువులను కూడా "స్వామి" అనే సంబోధిస్తారు.
ఏ దేవాలయానికి వెళ్ళినా మన పేరు మారదు.
అయ్యప్పదీక్షలో మాత్రం మన పేరు చివర "స్వామి" చేరి మనపేరు మారుతుంది. ప్రతి పేరు చివర "స్వామి" అనే పదాన్ని చేర్చి పిలవడం అయ్యప్ప దీక్షా సంప్రదాయంలో ఒక గొప్ప విషయం.

**స్వామియే శరణం అయ్యప్ప అంటే ఏమిటి ?**

స్వామియే శరణం అయ్యప్ప అన్న పదానికి గల అర్థాలను తెలుసుకుందాం...

స్వామియే అంటే...
"ఓ భగవంతుడా" అని!
శరణం అంటే "రక్షించు" అని! అయ్యప్పా అంటే "తండ్రి" అని! స్వామియే శరణం అయ్యప్పా అంటే "ఓ భగవంతుడా రక్షించు తండ్రి" అని అర్థం.
"భగవంతుడా నీవే నాకు దిక్కు" అని మరో అర్థం.

**స్వామియే శరణం అయ్యప్పా అనేది ఏమిటి ?**

స్వామియే శరణం అయ్యప్పా అన్నది తారక మంత్రం. తారక మంత్రం అంటే? తరింప చేయగలుగునట్టి శక్తి వంతమైనది అని అర్థం.
"స్వామియే శరణం అయ్యప్ప" అనే తారకమంత్రం అలవాటైతే ఏం లాభం కలుగుతుంది?
నియమ నిష్టలతో క్రమం తప్పకుండా శబరీశుని సేవించే అయ్యప్ప భక్తులకు "స్వామియే శరణం అయ్యప్పా" అనే తారకమంత్రాన్ని మాటమాటకూ పలకడం అలవాటైనప్పుడు ఆ భక్తుల హృదయాలలోని మాలిన్యాలన్నీ తొలగించబడతాయి.
ఆ తరువాత అలజడి లేని శాంత చిత్తము ఏర్పడి భక్తి పారవశ్యం కలుగుతూ ఉంటుంది. అట్టిభక్తి పారవశ్యం కలిగిన ఆ భక్తుని చుట్టూ ఎన్ని ఆకర్షణలు ఉన్నప్పటికీ వానిచే ఆకర్షింపబడకుండా భక్తిలో నిమగ్నమయ్యే అదృష్టం ప్రాప్తిస్తుంది. ఈ దశలో అట్టి భక్తి బంధాన్ని భగవంతుడే సంరక్షించుకుంటాడు. ఆ విధంగా భగవంతుని అనుగ్రహం కలిగినపుడు ఆ భక్తునికి అత్యుత్తమమైన ఆధ్యాత్మిక సిద్ధి ప్రాప్తిస్తుంది.
అటువంటి సిద్ధి కలిగిన భక్తుడు 'స్వామియే శరణం అయ్యప్ప' అనే నామాన్ని మామూలుగా పలకడు. దీక్షతో పలుకుతాడు ! శ్రద్ధతో పలుకుతాడు !! భక్తితో పలుకుతాడు !!
ఇంతటి శక్తి ఎప్పుడైతే ఆ భక్తునికి కలుగుతుందో ఆ వెంటనే కర్మయోగ జ్ఞానయోగాది యోగ మార్గములన్నిటినీ తనకు తెలియకుండానే తాను అధిగమించి స్వామితో నిత్య సంబంధం కలిగి యుంటాడు.
అప్పుడా భక్తునికి ఎరుకలో - నిద్రలో నడకలో - పడకలో, ధ్యానంలో - ప్రయాణంలో మాటలో - మౌనంలో, చూపులో - చేష్టలో మనస్సు నిండా అయ్యప్పే నిండివుంటాడు.
అటువంటి భక్తి కలిగియున్న భక్తుని నాలుకపై 'స్వామియే శరణం అయ్యప్ప' అనే తారకమంత్రం నిరంతరం నిలచియుండేలా ఆ శబరీశుడే స్వయంగా వ్రాసి వెళ్ళిపోతాడు.




" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు


# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు



**నవతరం -శ్రీకాకుళం**

పర్యావరణ కాలుష్యాన్ని నివారించగల చివరి తరం మనమేనని, భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం దీపావళి గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం దెబ్బతింటే మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా దీపావళి గ్రామంలో ప్రతి ఇంటి వద్ద ఒక మొక్క నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.
ప్రజలు తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని హరిబాబు సూచించారు. కోర్టుల చుట్టూ తిరగకుండా సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అత్యవసర న్యాయ సాయం లేదా సలహాల కోసం టోల్ ఫ్రీ నంబరు 15100కు కాల్ చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ఎం. సింహాచలం, గ్రామ సర్పంచ్ సి.హెచ్. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, వి.ఆర్.ఓ తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పుల వేళ పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం ప్రమాదమే

ప్రస్తుతం మన ప్రాంతంలో వాతావరణం రోజు రోజుకు మారుతూ ఉంది. ఉదయం చల్లదనం, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం తేమతో కూడిన గాలులు ఉండటం వల్ల ముఖ్యంగా చిన్నపిల్లలు త్వరగా అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత అనుభవాలను పరిశీలిస్తే, ఇదే కాలంలో పిల్లల్లో వైరల్ ఫీవర్లు, శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్లు, విరేచనాల కేసులు ఎక్కువగా నమోదయ్యాయి.

చిన్నపిల్లల విషయంలో "సాధారణ జ్వరం" అని నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈ కాలంలో వచ్చే వ్యాధులు, నూతన శిశువుల సంరక్షణ వంటి అంశాలపై ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డా. సీపాన రాజేష్ (శ్రీకాకుళం) నవతరం దిన పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది.

- జ్వరం, దగ్గు అని తేలికగా తీసుకోవద్దు - చిన్నపిల్లల్లో వేగంగా వ్యాధులు
- వైరల్ ఫీవర్ నుంచి న్యుమోనియా వరకు ముప్పు
- నూతన శిశువులకు ప్రత్యేక జాగ్రత్తలు అవసరం
- ముందస్తు జాగ్రత్తలే పిల్లల ఆరోగ్యానికి అసలైన రక్షణ

**ఇంటర్వ్యూ**

**నవతర ఎడిటర్:**
ప్రస్తుతం వాతావరణం పిల్లల ఆరోగ్యంపై ఎందుకు ఎక్కువ ప్రభావం చూపుతోంది?

**డా. సీపాన రాజేష్:**
పిల్లల శరీరం వాతావరణ మార్పులకు పెద్దల కంటే త్వరగా స్పందిస్తుంది. ఉదయం చలిగా, మధ్యాహ్నం వేడిగా, రాత్రి తేమగా ఉండటం వల్ల పిల్లల రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు వెంటనే వస్తాయి. ఐదేళ్ల లోపు పిల్లల్లో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది.



**డా. సీపాన రాజేష్**
ఎం.డి. (చిన్న పిల్లల వైద్య శాస్త్రం - నిలూఫర్)
నియోనాటాలజీ లో ఫెలోషిప్
కన్సల్టెంట్ పిల్లల వైద్య నిపుణుడు & నూతన శిశు వైద్య నిపుణుడు, శ్రీకాకుళం

**నవతర ఎడిటర్:**

ఈ కాలంలో పిల్లల్లో ఎక్కువగా ఏ వ్యాధులు కనిపిస్తున్నాయి?

**డా. సీపాన రాజేష్:**

ప్రస్తుతం వైరల్ ఫీవర్, గొంతు ఇన్ఫెక్షన్లు, న్యుమోనియా, విరేచనాలు, వాంతులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల ముప్పు కూడా ఉంది. చిన్నపిల్లల్లో నీరు తగ్గిపోవడం (డీహైడ్రేషన్) త్వరగా జరుగుతుంది, ఇది చాలా ప్రమాదకరం.

**నవతర ఎడిటర్:**
నూతన శిశువుల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేకంగా ఏం గమనించాలి?

**డా. సీపాన రాజేష్:**

నూతన శిశువులు చాలా సున్నితమైనవారు. పాల తాగకపోవడం, ఎక్కువగా నిద్రపోవడం లేదా అసహజంగా ఏడవడం, శ్వాస వేగంగా తీసుకోవడం, శరీరం చాలా వేడిగా లేదా చల్లగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇంట్లోనే మందులు ఇవ్వడం చాలా ప్రమాదకరం.

**నవతర ఎడిటర్:**
పిల్లల విషయంలో తల్లిదండ్రులు రోజూ పాటించాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

**డా. సీపాన రాజేష్:**

పిల్లలకు ఉడికించి చల్లార్చిన నీరు ఇవ్వాలి. బయట ఆహారం పూర్తిగా తగ్గించాలి. బయట ఆడుకుని వచ్చిన వెంటనే చేతులు, కాళ్లు సబ్బుతో కడగించాలి. దోమలు పెరగకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. వాతావరణానికి తగ్గ దుస్తులు వేయించడం చాలా అవసరం.

**నవతర ఎడిటర్:**

పిల్లల రోగనిరోధక శక్తి పెరగాలంటే ఏం చేయాలి?

**డా. సీపాన రాజేష్:**

పిల్లల ఆహారం చాలా కీలకం. ఇంట్లో తయారు చేసిన తాజా ఆహారం ఇవ్వాలి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి పోషకాలు ఉన్న ఆహారం పిల్లల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సరిపడా నిద్ర, శారీరక చురుకుదనం కూడా అవసరం.

**నవతర ఎడిటర్:**
జ్వరం లేదా ఇతర లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు ఏం చేయాలి?

**డా. సీపాన రాజేష్:**

జ్వరం రెండు రోజులకంటే ఎక్కువగా ఉంటే, తగ్గని దగ్గు, విరేచనాలు, వాంతులు ఉంటే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. ఇతరుల సలహాతో లేదా ఫార్మసీలో చెప్పిన మందులు ఇవ్వడం పిల్లల విషయంలో చాలా ప్రమాదకరం.

**నవతర ఎడిటర్:**

చివరగా తల్లిదండ్రులకు మీ ముఖ్య సందేశం ఏమిటి?

**డా. సీపాన రాజేష్:**

పిల్లల ఆరోగ్యం విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది. ముందస్తు జాగ్రత్తలు, సరైన ఆహారం, సకాలంలో టీకాలు, అవసరమైనప్పుడు వైద్య సలహా తీసుకోవడమే పిల్లల ఆరోగ్యానికి అసలైన రక్షణ.

# మినీ అంగన్‌వాడీలకు పదోన్నతి



**నవతరం -పాతపట్నం**

పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలం బాబీ కళ్యాణ మండపంలో కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తున్న 35 మందికి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి నియామక పత్రాలను శాసనసభ్యుడు మామిడి గోవిందరావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదోన్నతి నియామక పత్రాలను అందజేయడం తనకెంతో ఆనందంగానుందని, అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నపిల్లల ఆరోగ్యం, గర్భిణుల పోషణ విషయంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జీ మొబైల్ ఫోన్లు అందించిన ఘనత ఈ కూటమి ప్రభుత్వానిదేనని, అలాగే గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీ చంద్రబాబు నాయుడుకే చెందుతుందని, భవిష్యత్తులో కూడా అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి తమ పూర్తి మద్దతుంటుందన్నారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

## - రెల్లవీధి శ్రీరామ మందిరంలో ఉత్తర ద్వార దర్శనం
## - భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం



**నవతరం-శ్రీకాకుళం**

వైకుంఠ ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం పట్టణంలోని రెల్లవీధి శ్రీరామ మందిరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. "వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠంలో ముప్పైమూడు కోట్ల దేవతలు శ్రీమన్నారాయణుని దర్శించి సేవిస్తారు" అన్న విశ్వాసంతో ఈ పర్వదినాన్ని ముక్కోటి ఏకాదశిగా కూడా పిలుస్తారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ మావుడూరు రాఘవ శర్మ, మావుడూరు భార్గవ్ శర్మ గారిచే ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. 90 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాచీన రామాలయంలో ఉత్తర ద్వార దర్శనంలో భాగంగా ముందుగా శ్రీ మహావిష్ణువును, అనంతరం హనుమత్ సమేత శ్రీ సీతారామ లక్ష్మణులను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి ప్రణవానంద తులసిదాస్ (అలిగి చిరంజీవి) గారి భజన బృందం ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుంగ గంగాధర్, అలిగి దినేష్, రెల్ల మోహన్ రావు, అలిగి సత్యనారాయణ, రెల్ల జగన్నాథం, పొట్నూరు వెంకటరమణతో పాటు సలహా సభ్యులు పొట్నూరు వెంకటరత్నం, రెల్ల గోపి, బుర్రి మధు తదితరులు పాల్గొన్నారు.

# ఘంటసాల గీతాలు అజరామరం




**నవతరం-శ్రీకాకుళం**

ఘంటసాల గానం చేసిన గీతాలు చిరస్థాయిగా నిలుస్తాయని విజయనగరం సంగీత పూర్వ పర్యవేక్షకులు బివి నారాయణ అన్నారు. అమర గాయకులు ఘంటసాల 103 వ జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం గురజాడ కళా భారతి ఆడిటోరియంలో విశాఖకు చెందిన నారీభేరి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘంటసాల సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఉత్తరంధ్ర లో ఖ్యాతి గాంచిన నారీ భేరి సంస్థ గాయకులను అభినందించారు. అనంతరం ఏర్పాటైన సంగీత విభావరిలో సత్యానంద్, భాగ్యలక్ష్మి పాడిన ఇదియే జీవితానందము, చింతపల్లి సత్యనారాయణ, సీవీ రాజేశ్వరి పాడిన హాయి హాయిగా ఆమని సాగే, పెమ్మరాజ్ రామ్, శైలజా మీరాజ్ పాడిన కలల అలలపై, చింతా వెంకట్ పాడిన పుష్ప విలాపం, ముక్కా శ్రీనివాస్, భాగ్యలక్ష్మి పాడిన హిమగిరి సొగసులు, పుండరీ కుమార్, సీవీ రాజేశ్వరి పాడిన ఇంగ్లీ షు లోన మ్యారేజీ, లక్ష్మణరావు పాడిన జయ కృష్ణా ముకుందా మురారీ, డా. శ్రీనివాస్, శైలజా మీరాజ్ పాడిన మురిపించే అందాలే, రామకృష్ణ పాడిన శ్యామ్మలా దండకం లాంటి గీతాలు ఆహుతుల ప్రశంసలు పొందాయి. కీబోర్డ్ పై సోమేశ్, తబలపై బివి రమణ మూర్తి, ఫ్యాడ్స్ పై బాబూరావు పాటకు తగ్గ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, ఘంటసాల స్మారక కళా పీఠం వ్యవస్థాపకులు భీష్మారావు, ప్రముఖ చాయా గ్రహకుడు బుర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**-చెన్నా తిరుమలరావు, సెల్ 8179605267**

# హెటిరో కు 38 మంది
# కాకినాడ ఆదిత్య డిగ్రీ విద్యార్థుల ఎంపిక

**నవతరం-శ్రీకాకుళం**

స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల కొ.ఎడ్ క్యాంపస్ లో ప్రముఖ ఫార్మాకంపెనీ హెటిరో డ్రగ్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలలో తమ కళాశాల విద్యార్థులు 38 మంది ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యన్వి. వేణుగోపాల్ తెలిపారు. డిగ్రీలో చివరి సంవత్సరం ఉంటుండగానే ఈ ఉద్యోగ అవకాశాలు లభించినట్టు, క్యాంపస్ ఇంటర్వ్యూలకు మారుపేరు కాకినాడ ఆదిత్య అన్నారు. విద్యార్థులకు ప్రముఖ బహుళ జాతి సంస్థల ద్వారా క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామనీ, ప్రతీ విద్యార్థికి డిగ్రీతోపాటు ఉద్యోగం కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రముఖ ఫార్మాకంపెనీ హెటిరో డ్రగ్స్ నిర్వహించిన ఈ క్యాంపస్ ఇంటర్వ్యూ లో 38 విద్యార్థులు ఎంపికవడం పట్ల హర్షం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 2.76 వార్షిక వేతనం లభిస్తుందన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డా. ఎన్ సుగుణ రెడ్డి మాట్లాడుతూ తమ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యతో పాటు, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామనీ, అంతే గాక తమ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం నుండే క్యాంపస్ ఇంటర్వ్యూలకు అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నామనీ , తద్వారా వారు వివిధ క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపిక కాగలుగుతున్నారన్నారు. ప్రముఖ ఫార్మా సంస్థ హెటిరో కంపెనీలో 38 మంది ఎంపిక అవడం హర్షనీయమని తెలిపారు. అనంతరం ఉద్యోగం సాధించిన విద్యార్థులను చైర్మన్ ఎన్.శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బి వి యల్.నాయుడు, డైరెక్టర్ బి ఎస్ చక్రవర్తి అభినందించారు.



# విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన



**నవతరం-శ్రీకాకుళం**

ఆచార్య నాగార్జున అగ్రికల్చర్ యూనివర్సిటీ, నైరా, విద్యార్థిని విద్యార్థులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖను సందర్శించడమైనది. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సూచనతో విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని లక్ష్యంతో 55 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను సందర్శించి ఇన్చార్జిలతో మాట్లాడి సేవా కార్యక్రమాలు అమలు తీరును ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు మాట్లాడుతూ కళాశాల దశ నుండి విద్యార్థులకు సేవ కార్యక్రమాలు అవగాహన కల్పించడం, భాగస్వామి చేయటం వ్యవసాయ, వ్యవసాయత రంగాల్లో రైతులకు సహాయకారిగా ఉండటానికి, అవసరమైన సేవా కార్యక్రమాలు రూపొందించడానికి ఒక అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ టైలరింగ్ సెంటర్, రక్త నిధి కేంద్రం, మెడిసిన్ బ్యాంక్స్, శాంత కల్యాణ అనురాగ నిలయం, సివి నాగజ్యోతి ఆనంద నిలయం, ఆర్టిజన్ సెంటర్, తలసేమియా రక్త మార్పిడి కేంద్రంలను సందర్శించి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మాల కొండయ్య, రెడ్ క్రాస్ ప్రతినిధులు ఏ.నర్సింగరావు, కే.సత్యనారాయణ, జి రమణ,బి. సతీష్ కుమార్ గుణాకర్ రావు,ఉమ, హర్ష సిబ్బంది వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు రూ. 1.07 లక్షల బకాయిల చెల్లింపు



**నవతరం-శ్రీకాకుళం**

జిల్లాలోని పలు దుకాణాలు, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల చట్టం ప్రకారం రావలసిన బకాయిలను కార్మిక శాఖ అధికారులు రికవరీ చేయించారు. మంగళవారం శ్రీకాకుళం ఉప కార్మిక కమిషనర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ ద్వారా ఎంపికైన సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 22 మంది కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే తక్కువ వేతనాలు చెల్లిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, యజమానుల నుంచి రూ. 1,07,161 వ్యత్యాస వేతన మొత్తాన్ని రికవరీ చేసి, ఆ మొత్తాన్ని డి.డి.ల రూపంలో బాధితులకు అందజేశారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో కార్మికులందరికీ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇప్పించడంతో పాటు, వారందరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించినట్లు డి.ఎల్.సి తెలిపారు. కనీస వేతనాల అమలులో నిర్లక్ష్యం వహించే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు తప్పవని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# విశాఖ 18వ సిఐటియు మహాసభలకు జీపు జాత



## రాష్ట్ర సిఐటియు నాయకులు అజయ్ కుమార్

**నవతరం టెక్కలి**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేటర్ల కొమ్ముగాసి కార్మిక ఉద్యమాల్ని అనిసి వేస్తున్నాయిఅని తద్వారా కార్మిక కుటుంబాలను అణగదొక్కి అనాధ పాలు చేస్తున్నాయని రాష్ట్ర సిఐటియు నాయకులు అజయ్ కుమార్ అన్నారు 18 వ సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలోజరుగుతున్న సందర్భంగా మందస వీర నారి గున్నమ్మ స్థూపం నుండి బయలుదేరిన జీపుజాత ఈ దినం 11 గంటలకు టెక్కలి చేరుకున్నది ఈ సందర్భంగా టెక్కల్లో టాక్సీ స్టాండ్ వద్ద సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు అద్యక్షతన సభ జరిగింది . నేటి నుండి జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే అఖిలభారత సిఐటియు మహాసభలు కార్పొరేట్ విధానాలపై చర్చించి ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించబోతున్నది, లేబర్ కోర్టులు రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ,కార్మిక వర్గ అనుకూల విధానాలను అమలు చేయించడానికి పాలకవర్గంపై ఒత్తిడి పెంచటానికి , ఈ ప్రత్యామ్నాయ విధానాల అమలకోసం సమరశీల పోరాటాలకు శంఖారావం పూనించ నుంది ఐదు రోజులు జరిగే ఈ అఖిల భారత మహాసభ చర్చించిన విషయాలను 2026 జనవరి 4న బహిరంగ సభ ద్వారా దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి పిలుపునివ్వనుంది. విశాఖపట్నం వేదికగా దేశంలో ఉన్న కార్మిక వర్గానికి ఒక నూతన ఉత్తేజాన్ని ఇవ్వబోతోందని జిల్లా కార్యదర్శి కె.నాగమణి అన్నారు . కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు జీతాలు పెంచం , జీవితాంతం పనులు చేసిన పర్మినెంట్ చేయం. విశాఖ స్టీల్ ప్లాంట్ తో సహా అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమలను వేలం వేస్తాం లేదా మూసివేస్తాం , పెన్షన్ బిక్షగా ఇస్తాం , లేబర్ కోడ్స్ పేరుతో బ్రిటిష్ కాలం నాటి నుండి సాధించుకునే హక్కులను తొలగిస్తాం, సంఘాలు పెట్టనివ్వం, సమ్మెలు చెయ్యనివ్వం,అనే తప్పుడు విధానాలను అమలు చేస్తున్నది. సర్వసంపదలు సృష్టించేది కార్మిక వర్గం ఒక్కటేఅని సిఐటియు జిల్లా కార్యదర్శి అల్లు మహాలక్ష్మి అన్నారు. ప్రజలకు తిండి పెట్టే వ్యవసాయ కార్మికుల ఉపాధి చట్టాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేసింది కావున కార్మికులు కష్టజీవులు ఈ మహాసభకు మద్దతు పలుకుతు సహాయ సహకారాలు అందించాలని నాయకులు కోరారు . ఈ కార్యక్రమంలో సిఐటియు లక్ష్మీనారాయణ, లక్ష్మణ రావు, ధర్మారావు,అప్పన్న, జిల్లా రైతు సంఘం నాయకులు కే మోహన్ రావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కొల్లి యల్లయ్య, ధనలక్ష్మీ,తవిటయ్య,శోభను,సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**